క్లుప్తంగా

అన్నదానం



ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం ఎర్రముక్కప ల్లెలోని నవజీవన్ సేవా ఆశ్రమంలో సోమవారం క్రిస్టఫర్ జార్జి ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులు, అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఛారిటబుల్‌ట్రస్టు అధినేత కృపాజార్జి ఈ సందర్భంగా నవజీవన్ సేవా ఆశ్రమ నిర్వాహకులకు వంట సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎర్రముక్కపల్లె సిబ్బంది వెంకట గోపాల్‌రెడ్డి, ఓ.రమేష్, యల్లయ్య, ట్రస్టు సభ్యులు ఆదినారాయణ, రంగయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. సోమవారం ఈ చలివేంద్రాన్ని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మానవత ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతిరోజూ 2500 లీటర్ల మజ్జిగను పంపిణీ చేయాలని ఈ చలివేంద్రాన్ని ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో 'మానవత' వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, డైరెక్టర్లు డా. రామాంజనేయులురెడ్డి, ఆర్. గోపి, మాధవరెడ్డి, సుబ్బరాయుడు, పి. గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు నషాన్ ఉత్సవం



చాంద్‌ఫిరా గుంబద్ దర్గా

కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలోని చారిత్రాత్మకమైన చాంద్ ఫిరా గుంబద్ దర్గా నషాన్ ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి అమీరున్నిసా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దర్గా ఆవరణంలో జెండా నషాన్ ఉత్సవాలు నిర్వహించి, ఫాతెహా చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తాదులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేస్తామన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొన్ని గురువుల ఆశీస్సులు పొందాలని కోరారు.

టీ స్టాల్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పరిధిలో సుజుకి షోరూం ఎదురుగా రామచంద్ర అనే వ్యక్తికి చెందిన టీ స్టాల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కడప అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని అగ్ని ప్రమాదాన్ని నివారించారు. టీ స్టాల్‌లోని కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు తదితర సామగ్రి కాలిపోయింది. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు యజమాని తెలిపారు.

మాక్ పాలిసెట్‌కు స్పందన



మాక్ పాలిసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడప కేఓఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు సోమవారం కళాశాలలో మాక్ పాలిసెట్ నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ లావణ్యారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ లక్షితరెడ్డి మాట్లాడుతూ పాలిసెట్ రాసే విద్యార్థులకు భయాందోళనలను పోగొట్టేందుకే ఈ మాక్ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈసీ హెచ్‌ఓడీ మధు, ఎంబీఏ అండ్ టీపీఓ హెచ్‌ఓడీ రెడ్డి మురళీకృష్ణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నటన... సంగీత సంభరితం నాట్యం

నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం



నృత్యం చేస్తున్న కళాకారులు (ఫైల్)

కడప కల్చరల్ : నాట్యం విలక్షణమైన కళారూపం. సంగీతంతోపాటు నటనను రంగరించి ప్రేక్షకుల హృదయాలను ఊపేసేలా అలరించే లక్షణం నృత్యానికి ఉంది. అందుకే ఇది విలక్షణమైన ప్రక్రియ. దీన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో ఎవరికి వారు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఏటా ఏప్రిల్ 29న అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాము. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ జిల్లాలోని నాట్యరంగం విశేషాలు..

■ మన జిల్లాలో 1970 ప్రాంతంలో నిడుమోరు కృష్ణమూర్తిరాజుతో నాట్యం గురించి విస్తృతంగా ప్రచారం జరిగింది. శాస్త్రీయ నృత్యానికి ఆయనే బీజావాసం చేశారు. అనంతరం ఆయన శిష్యగణం చల్లా జగ్జీవన్‌రావు, బళ్లారి జిలానీ, సుధారాయుడు, ఉమామహేశ్వరరావు, ఏసుదాస్ తదితరులు ఆయనకు ప్రియ శిష్యులుగా శాస్త్రీయ నృత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. తర్వాతి తరంలో నర్తకీమణులు జిల్లా నృత్య వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు. చల్లా జగ్జీవన్‌రావు ప్రియ శిష్యురాలిగా స్పందన, ఆ తర్వాత ఆమె సోదరి లలన జిల్లాలో అమ్మాయిలకు పెద్ద సంఖ్యలో నృత్యం నేర్పారు. మహిళల్లో ముద్ర డ్యాన్స్ అకాడమిల పేరుతో ఇటీవల కాలంలో విజయశాంతి ఎంతో కృషి చేస్తున్నారు. దాదాపు ఆమె తన జీవితాన్ని నృత్యకళకు అంకితం చేశారు. వీరి సమకాలికుడైన రామాంజనేయులు, శ్రీకరి నృత్య అకాడమి పేరిట పలువురు చిన్నారులకు శాస్త్రీయ నృత్యాన్ని నేర్పి జిల్లాలో తనదైన ముద్ర సాధించారు.

■ మోహిద్దీన్‌ఖాన్‌కు జిల్లా నృత్య రంగంలో ప్రత్యేక స్థానం ఉంది. ప్రొద్దుటూరులో శ్రీ నటరాజా కళాక్షేత్రం ఏర్పాటు చేసి దాంతోపాటు పులివెందులలో కూడా వందలాది మందికి నృత్యం నేర్పారు. వీరి శిష్యులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఆ రంగంలో మంచి పేరు సాధించి కొనసాగుతున్నారు.

సంస్థల కృషి..

జిల్లాలో సవేరా నాటక సంస్థ నిర్వాహకులు ఆళ్లూరి వెంకటయ్య, అన్నమయ్య ఆర్ట్స్ అకాడమి పేరిట సీనియర్‌కవి ఎన్‌సీ రామసుబ్బారెడ్డి, త్యాగరాజ నృత్య సంగీత కళాశాలలను స్థాపించి తమవంతుగా ఈ రంగం అభివృద్ధికి కృషి చేశారు. కడపతోపాటు పులివెందులలో వైఎస్‌ఆర్ హయాంలో రూపుదిద్దుకున్న శిల్పారామాలలో ప్రతి ఆదివారం నృత్యప్రదర్శనలు జరుగుతున్నాయి. స్థానిక నృత్యకారులకు ఈ కార్యక్రమం ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటున్నాయి. మరోవైపు సోషల్ మీడియా, టీవీ ఛానళ్లు నృత్య పోటీలను నిర్వహించి నృత్య కారులను ప్రోత్సహిస్తున్నారు.

బోధనలో కమ్యూనికేషన్ ప్రధానం



మాట్లాడుతున్న వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : ఆంగ్ల భాషలో చక్కటి కమ్యూనికేషన్ నైపుణ్యాలతో అధ్యాపకులు తరగతులను ప్రభావవంతంగా నిర్వహించగలరని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాస రావు అన్నారు. 'ఎఫెక్టివ్ క్లాస్ కమ్యూనికేషన్ ఫర్: టీచింగ్ కమ్యూనిటీ' అంశంపై అంతర్జాల సదస్సు సోమవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ సబ్జెక్టు నాలెడ్జి లోతైన పరిశోధన జ్ఞానం, ఆంగ్లంలో చక్కటి భావవ్యక్తీకరణ నేటి గురువులకు అవసరమన్నారు. నాలెడ్జ్ షేరింగ్ కు, స్వీకరణకు ఉపయోగపడుతుందన్నారు. కీలక ఉపన్యాసకులుగా హాజరైన ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే వెంకటరెడ్డి ని వీసీ అభినందించారు. వైవీయు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఆంగ్ల భాషలో భావవ్యక్తీకరణ విస్తృత అవకాశాలు కలిగిస్తుందన్నారు. కులసచివులు ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ బోధనలో సాంకేతికతను ఉపయోగించాలన్నారు.

హైదరాబాద్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే వెంకటరెడ్డి గురు శిష్యుల పరంపర, ఆధునిక అధ్యాపకుడిగా నేటి గురువు బాధ్యత, కమ్యూనికేషన్ ఆవశ్యకత, భాష పైన లోతైన జ్ఞానం అవసరం గురించి సమకాలిన సంఘటనలను జోడిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రామచంద్ర రెడ్డి, సహ ఆచార్యులు డాక్టర్ టి. చంద్రశేఖర్, డాక్టర్ జయంత్ కశ్యప్, ఆచార్య రియాజున్నీసా, ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి సరిత, డాక్టర్ అను ప్రసన్న, అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు.

సామాజిక సమస్యలే ప్రధానంగా 'కాళ్లకూరి' నాటకాలు



కాళ్లకూరి నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాటకాభిమానులు

కడప కల్చరల్ : నాటి సమాజాన్ని పట్టిపీడిస్తుండిన సమస్యలనే ప్రధానంగా ప్రస్తావిస్తూ సుప్రసిద్ధ నాటక రచయిత కాళ్లకూరి నారాయణరావు తన నాటకాలను ప్రయోగించారని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక పెన్షనర్స్ ఆఫీసులో సోమవారం వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కాళ్ళకూరి నారాయణరావు 155 వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నూనెనగేష్, ఆకేపాటి సుబ్బరాయుడు, తుపాకుల నారాయణ, బాల ఓబయ్య, బ్యాంక్ గంగయ్య, రాయుడు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పుష్ప'గిరి' ప్రదక్షిణపై ఇన్ని కల్పితాలు ఎందుకు?

కడప కల్చరల్ : పుష్పగిరి గిరి ప్రదక్షిణ అంశంపై జిల్లా దేవదాయశాఖ అధికారులు ప్రైవేటు వ్యక్తులతో కలిసి ఇన్ని కల్పితాలు ప్రచారం చేయడం వెనుక ఆంతర్యం ఏమిటో చెప్పాలని పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షులు సట్టి భారవి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్సీ ఎస్టీ హక్కుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సత్యనారాయణగాంధీ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారవి మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ప్రారంభమైన పుష్పగిరి గిరి ప్రదక్షిణ రోజురోజుకు విజయవంతగా కొనసాగుతుండడం అందరికీ తెలిసిందేనని, మరి ఇప్పుడెందుకు లేనిపోని అభ్యంతరాలు దేవదాయశాఖ లేవనెత్తుతుందో చెప్పాలన్నారు. సత్యనారాయణగాంధీ మాట్లాడుతూ రెండేళ్లు సజావుగా సాగిన ఈ కార్యక్రమాన్ని ఆది పూజలతో ప్రారంభించాలని ప్రైవేటు వ్యక్తి చెప్పగా, సాక్షాత్తు జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఇకపై అనుమతులు లేకుండా గిరి ప్రదక్షిణ చేయకూడదని, ఈ మేరకు ప్రైవేటు వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నుంచి అనుమతులు తెచ్చామని ప్రకటించడాన్ని బాలకృష్ణ, వాసు, వరప్రసాద్‌లు ప్రశ్నించారు. అయితే డిప్యూటీ సీఎం కార్యాలయం ఇచ్చిన నిషేధ ఆజ్ఞ పత్రాలు తమకు ఇవ్వాలని కోరగా, అదేం లేదని, గిరి ప్రదక్షిణ చేసుకోవచ్చని దేవదాయశాఖ అధికారి మాట మార్చడం వెనుక ఆంత్యర్యం ఏమిటో తెలపాలని నిలదీశారు. రమేష్, శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ సాక్షాత్తు పుష్పగిరి పీఠాధిపతి అనుమతించిన ఈ ప్రదక్షిణను వీరు ఏ హక్కుతో అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. సమావేశంలో శ్రీనివాసులు, రాజా, రవికుమార్, నివేద్, రాజు, భాస్కర, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం



చోరీ సొత్తు స్వాధీనం వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైలు ప్రయాణికురాలు పోగొట్టుకున్న చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, దొంగను అరెస్టు చేశామని జీఆర్‌పీ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ సునీల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కడప రైల్వే పోలీసు స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాచిగూడ నుంచి చిత్తూరుకు వెళుతున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ఈనెల 10వ తేదీన అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన ఎం.విద్యశ్రీ మహిళల బోగీలో ప్రయాణిస్తుండగా బంగారు చైను, ఉంగరం, రూ. 27 వేల నగదును అపహరించారన్నారు. కడప జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ క్రమంలో రైల్వే ఎస్పీ, డీఎస్పీ ఆధ్వర్యంలో రెండు టీములుగా కడప రైల్వే పోలీసులు విచారించి దొంగతనం కేసును ఛేదించారని తెలిపారు. సోమవారం ఉదయం ప్రొద్దుటూరుకు చెందిన మహిళా దొంగను అరెస్టు చేసి ఆమె వద్దనుంచి ఐదు గ్రాముల రింగు, 12 గ్రాముల బంగారు గొలుసు, 27 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. త్వరలో బాధితురాలికి పోగొట్టుకున్న సొమ్మును కోర్టు ద్వారా అందిస్తామని తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్ : చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని దివ్యాంగుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్ పేర్కొన్నారు. సోమవారం కే ఓఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నషా ముక్తి ..భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన దివ్యాంగుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్ మాట్లాడుతూ మత్తుపదార్థాలు వ్యక్తిగత జీవితాన్నే కాదు కుటుంబాన్ని, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తాయన్నారు. విద్యార్థులు దుష్ప్రభావాల నుంచి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ లావణ్య రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరెస్టు చేయడం అన్యాయం

కడప రూరల్ : బీసీ జనగణన కోసం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు శాంతియుతంగా ధర్నా చేస్తుంటే అరెస్టు చేయడం అన్యాయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం బీసీల సహకారంను విస్మరించిందని ఆరోపించారు. తెలంగాణలో బీసీ కుల గణన జరగడంతో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని బీసీల అభ్యున్నతి కోసం మా నాయకుడు శంకర్ రావు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టడంతోపాటు బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గురుస్వామి, రామాంజనేయులు, త్రివిక్రమ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పెట్టాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రస్తుతం ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న రెమిడియల్ క్లాస్ విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం వడ్డించాలని జిల్లా జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం మాజీ సెక్రటరీ చెప్పలి రాజారావు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఇంటర్ ఆర్‌జేడీ శ్రీనివాసులను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెమిడియల్ క్లాసులకు గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారన్నారు. వారు మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు పడకుండా వారికి భోజనాన్ని వడ్డించాలన్నారు.

'సంవిధాన్ బచావో అభియాన్'ను విజయవంతం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : భారత రాజ్యాంగాన్ని రక్షించేందుకు 'సంవిధాన్ బచావో అభియాన్' పేరుతో 40 రోజుల పాటు కొనసాగే జాతీయ స్థాయి ప్రత్యేక ప్రచారాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాబోయే 40 రోజుల్లో జిల్లాలో చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 29న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కనుల పండువగా హేలాంబ తిరునాల

కమలాపురం: మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ హేలాంబ అమ్మవారి తిరునాల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ నెల 23వ తేదీ నుంచి జరుగుతున్న హేలాంబ తిరునాల మహోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రధాన తిరునాల కనుల పండువగా జరిగింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రవీంద్ర, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తిరునాల మహోత్సవాలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఉదయం తోట కుటుంబ సభ్యులు అమ్మవారికి బంగారు కిరీటం, బంగారు చీర, ఆభరణాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు పుష్పాలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు.

రాయితీని వినియోగించుకోండి

కమలాపురం: కమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇప్పటివరకు ఉన్న ఆస్తి పన్ను బకాయిలకు సంబంధించి వడ్డీలో 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ సోమవారం తెలిపారు. 2024–25 ఏడాదికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఈ నెల 30వ తేదీలోపు చెల్లిస్తే వడ్డీలో 50 శాతం మాఫీ జరుగుతుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అలాగే 2025–26 ఏడాదికి సంబంధించి ఆస్తి పన్నులు చెల్లిస్తే అందులో 5 శాతం రిబేట్ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఆస్తి పన్ను బకాయిలను ఈ నెల 30వ తేదీలోపు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పుచ్చలపల్లి సుందరయ్య సేవలు చిరస్మరణీయం



పుచ్చలపల్లి జయంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్ : కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం సుందరయ్య 112వ జయంతిని పురస్కరించుకొని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ మనోజ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని, రక్తం అవసరమున్న వారికి ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్రారెడ్డి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య చిన్నతనం నుండి పేదలు, బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాడేవారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్. రవి మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపాలు, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్, ఉపాధ్యక్షులు ప్రకాష్, శ్రీధర్, నాగరాజు, అరుణ్, శ్రీను పాల్గొన్నారు.

గ్రంథాలయ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కడప కల్చరల్ : జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి స్థానిక కొండాయపల్లెలోని ప్రధాన కార్యాలయంలో విద్యార్థుల వేసవి ఉచిత శిక్షణా శిబిరం ప్రారంభమైంది. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం మాట్లాడుతూ వేసవి సెలవులను ప్రతిభావంతంగా, ఉపయోగకరంగా నిర్వహించుకునేందుకు బాలల కోసం ఇలాంటి కార్యక్రమాలు రూపుదిద్దడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, నృత్యం, ఒరిగామి, కథలు, పుస్తక పఠనం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలను జేవీవీ జిల్లా అధ్యక్షులు షామీర్‌బాషా, రంగనాయకులు, కీర్తికుమార్, ఉపాధ్యాయని భారతి విద్యార్థులకు నేర్పారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి ఇ. పవన్ కుమార్, బాబ్జి, నవాబ్ జాన్, సురేష్, జేమ్స్, రాంప్రతాప్, రమణ, సుబ్బమ్మ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట



రిలే నిరాహార దీక్షల్లో ఆర్టీసీ కార్మికులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అటు ప్రభుత్వం, ఇటు ఉన్నతాధికారులు సత్వర చర్యలు చేపట్టాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్‌చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట మల్లికార్జున, ఎస్ఎం బాషలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు నాగముని, కేఎస్ దాస్, శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికే సమస్యల పరిష్కారం కోసం విడతల వారీగా నిరసనలు, ఆందోళనలు చేపట్టామన్నారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో రిలే నిరాహార దీక్షలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. ముఖ్యంగా ఉద్యోగుల ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019 ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్ ఆపాలని, గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. అలాగే నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నా పట్టించుకునే నాదుడే లేడన్నారు. ఇప్పటికైనా కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ కోశాధికారి టీఎం బాషా, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజు, రామచంద్ర, ఈఈ సుబ్బమ్మ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ఎంఈఓల ద్వారా పంపిణీ చేయాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రిఫరెన్సియల్ కేటగిరీకి సంబంధించిన సర్టిఫికెట్లను మండల విద్యాశాఖ అధికారుల ద్వారా ఉపాధ్యాయులకు పంపిణీ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. ఈ విషయమై సోమవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి యూటీఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ త్వరలో జరగబోవు ఉపాధ్యాయ బదిలీలలో ఉపాధ్యాయులకు సంబంధించిన మెడికల్ టెస్ట్‌లకు సంబంధించిన సర్టిఫికెట్లను 29వ తేదీన డీఈఓ కార్యాలయంలో పంపిణీ చేస్తామని తెలియజేశారని.. అయితే ప్రిఫరెన్సియల్ కేటగిరీకి సంబంధించిన అనేకమంది ఉపాధ్యాయులు సుదూర ప్రాంతం నుండి జిల్లా కేంద్రానికి రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అలాగే వేసవి తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా మెడికల్ సర్టిఫికెట్లను ఆయా మండలాలకు సంబంధించిన ఎంఈఓల ద్వారా పంపిణీ చేయాలని కోరారు. ఈ విషయమై డీఈఓ మాట్లాడుతూ ప్రస్తుతానికి కొంతమంది సంబంధించిన సర్టిఫికెట్లు మాత్రమే వచ్చాయని, మంగళవారం రోజు మిగిలిన సర్టిఫికెట్లు అన్నీ వస్తాయని తెలిపారు. అయితే యూటీఎఫ్ కడప జిల్లా శాఖ అభ్యర్థన మేరకు అన్నమయ్య జిల్లాకు సంబంధించిన సర్టిఫికెట్లు రాయచోటికి పంపుతామని, మిగిలిన సర్టిఫికెట్లు ఎంఈఓల ద్వారా పంపిణీ చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో 12 వ వేతన సవరణ సంఘానికి (పీఆర్సీ) తక్షణమే చైర్మన్ ను నియమించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో సోమవారం జరిగిన ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తామని, సకాలంలో డీఏలు ఇస్తామని, పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని కూటమి నాయకులు హామీలు గుప్పించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించారని ఆరోపించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మి రాజా, ఎస్.నవ కోటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగార్జున రెడ్డి, జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, కె.చెన్నయ్య, సి.శ్రీనివాసులు, ఎస్.ఎజాస్ అహ్మద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శన నిర్వహణతో సృజన పెంపు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ విశ్వనాథ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్ : 'ఎమర్జింగ్ విజన్స్' ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందుతుందని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జి. విశ్వనాథ కుమార్ పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో శిల్పకళ విభాగం చివరి సంవత్సరం విద్యార్థులు కళాకృతులను ప్రదర్శించారు. సంబంధిత కార్యక్రమాన్ని వీసీ విశ్వనాథకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కళా ప్రదర్శనను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా భవిష్యత్తులో కళాకారులకు ప్రేరణగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపార్టుమెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లను విస్మరించడం తగదు

కడప ఎడ్యుకేషన్ : సమగ్రశిక్షలోని అన్ని విభాగాల ఉద్యోగులకు 11వ పీఆర్సీ ప్రకారం 23 శాతం జీతాల పెంపుదల చేసి క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లను విస్మరించిందని ఏపీ సీఆర్పీడబ్ల్యూఏ జిల్లా జనరల్ సెక్రటరీ మధు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరంలో డిసెంబర్ నెలలో జరిగిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెలో క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు పాల్గొన్నారనే కారణంతో పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.